

# వృద్ధాప్య వైభవం

వృద్ధాప్యం వచ్చిందని బెంగపడకండి. దీనివలన ఎన్నో లాభాలు ఉన్నాయి. మొదటిది ఆఫీసులో పని చెయ్యనక్కరలేదు (ఆఫీసులో ఉన్నప్పుడు కూడా సరిగ్గా పనిచేసి ఎరగడు అది వేరే విషయం). నెలసరి జీతం కంటే పెన్షన్ ఎక్కువ వస్తుంది. అన్ని అప్పులూ పోనూ జీతం అంతంతమాత్రంగా వచ్చేది. రిటైరయిన రోజున మూడులక్షల చిల్లర రొక్కం, ఓ బ్రీఫ్‌కేస్, పూలదండ ఇచ్చి ఉంటారు. ఎప్పుడూ పూలదండ వేయించుకొని ఎరగడు. అల్లాంటివాడికి సాదరంగా మెడలు వంచి దండ వేస్తారు. దండవేస్తారేమోనని ఆశపడి కవిసమ్మేళనాల్లో ఓ కవిత పట్టుకుని పాల్గొన్నప్పుడు, అందరికీ దండలు వేసి తనకు ఓ పూలగుత్తి ఇచ్చేవారు (స్టాఫ్ కదా అని). తాను కవినని చెప్పి చెప్పి అలసిపోతాడు. రిటైరయిన రోజున దండ చేతిమీద వేసికొని, ఆటోలో వెళ్ళి ఇంటిదగ్గర దిగవచ్చు. తనపై ఆఫీసర్లను లోపల తిట్టుకుంటూ దొంగ నమస్కారాలు పెట్టే పనిలేదు. సహన ప్రతిపత్తి కనిపిస్తుంది. చైనావాళ్ళ సామెత ఒకటుంది. చదరంగం ఆట అయిన తర్వాత రాజుని, బంటుని ఒకే డబ్బాలో పెడతారని అంతా సమానము గెజిటెడ్ పెన్షనరని, నాన్ గెజిటెడ్ పెన్షనరని ఉండవు. ఈ ప్రపంచం అంతా ఒక మూతలేని డబ్బా అనుకుంటే అందరూ సమానమే.

మీరు ఈ రిటైర్డు జీవితంలో ఏం చేద్దామనుకుంటున్నారు అని అడుగుతారు. చదవని పుస్తకాలు చదువుతానని, చూడని పర్యాటక ప్రదేశాలు చూస్తానని చెప్పవచ్చు. ఆఫీసులో

నిద్రపోయేది ఇంటిదగ్గర పోవచ్చు. రామాయణం, భారతం, భాగవతం అటకమీదనుంచి దింపి, దుమ్ము దులిపి, వ్యాసపీఠంమీద పెట్టి చదువులో నిమగ్నమయినట్లు పెద్దరికం చూపవచ్చు. చారుతులసీదళధామ అంటే చారులో తులసీదళం వేశారుట (కరివేపాకు లేకపోవటంవలన) అనుకున్న రోజులనుంచి "అనేక దంతం భక్తానాం ఏకదంతముపాస్మహే" అంటే భక్తులకు అనేక పళ్ళుంటాయని నాకయితే ఒకటే దంతం అటువంటివాడిని కొలుస్తాను అని అంతా చెప్పుకుంటారు. సరైన అర్థం ఏమిటని ఇంట్లో అడిగిచూడండి. మీ శ్రీమతి తెలియదు అని వప్పుకుంటుంది. అప్పుడు మీరు అనేకదంతం అంటే అనేకం ఇస్తాలే అని 'దంతం అంటే పళ్ళు కాదు నీకు చాలా ఇస్తాలే' అని అర్థం చెప్పు. ఈ సంగతి నాకురిటైరయిన రోజున తెలిసిందని ఇంట్లో తెలియనీకు.

ముసలాడు అంటే బాదపడతారని వృద్ధులనీ, సీనియర్ సిటిజన్స్ అని వ్యవహరిస్తారు. మీరు బాధపడకండి. ఆ ముద్ర ఉండటం మనకు లాభం. బస్సులో ప్రయాణం చేస్తున్నాం అనుకోండి. మనకు బస్సులో ప్రత్యేకంగా సీట్లు రిజర్వు అయి ఉంటాయి. అప్పటిదాకా ఆడవాళ్ళ సీట్లో కూర్చున్నారేంటి, లెండి లెండి అని లేవకొట్టినవాళ్ళు మీవంక చూచి ఊరుకుంటారు. మనకి మనం ఇంకా కుర్రాళ్ళే అనుకున్నా షష్టిపూర్తి ముఖం తెలుస్తూనే ఉంటుంది కదా! ఎవరేనా ఆ సీటులో కూర్చుంటే వాళ్ళను లేపి మీరు ఆ సీట్లో కూర్చోవచ్చు. అప్పుడు మీరు కాలరు సవరించుకోవచ్చు. ఇంకో లాభం కూడా ఉంది. స్త్రీలకు ప్రత్యేకం అని ఉంటుంది. అక్కడ కూడా పోయి కూర్చోవచ్చు. ఎవరన్నా వచ్చి లేవమంటే కష్టపడి లేస్తున్నట్లు నటించండి. పెద్దాయన! కూర్చోనీయండి అంటారు. మీరు సెటిల్ అయిపోండి. ఒకప్పుడు ఆడవాళ్ళ పక్కన చేయి చేయి తగులుతూ ఉంటుంది. ఒక్కోసారి మీ అదృష్టం బాగుంటే అప్సరసలు అందాలరాసులు తగలవచ్చు. చిన్నవాడని చేరదీస్తే ముంచుతాడే కొంప ముంచుతాడే అని సినిమాపాట ఒకటి ఉన్నది. ఆ పాట అన్వయం చేసుకుని పెద్దవాడని చేరదీస్తే అని లోపల లోపల పాడుకోవచ్చు.

మీరు రిటైరు అయ్యి వ్యాసపీఠం ముందు కూర్చుంటే ఈ రోజు తిథి ఏమిటండి అని అన్నప్రాశన, గృహప్రవేశాలకు మంచిరోజులు చెప్పమని వస్తారు. తెలియదనకండి. మీనమేషాలు లెక్కపెట్టడం వేళ్ళు కదపటం ఆకాశంవైపు, భూమివైపు నాలుగు దిక్కులవైపు చూడండి. అన్నింటికి దేవుడే దిక్కని మరువకండి. మీరేదో లెక్కలు వేస్తున్నారని భ్రమపడతారు. భ్రమలను మనం పోషించాలి. జీవనం భ్రమల బండిమీదనే సాగుతుంది. ఈ గొడవల్లో మీరు తలమునకలై ఉన్నప్పుడు పట్టువదలని విక్రమార్కుడిలా తిథి, నక్షత్రం ఏమిటని మళ్ళీ అడుగుతారు. తెలియనట్లు ముఖం పెట్టకండి. ఒకసారి ఇంట్లోకి పోయి కాలెండరు చూసి రండి. విశేషం ఏమిటని నవ్వుతూ అడిగి, తిథి, నక్షత్రం, రాహుకాలం, వర్జ్యం అని చెప్పండి. ఎంత పాండిత్యం! అని ఆశ్చర్యపడతారు. జ్ఞానసముపార్జనం, అజ్ఞానాన్ని దాచటం కష్టం అన్నమాట మరువకండి.

కొద్దిపాటి పరిచయం ఉన్న వాళ్ళు ఆఫీసులోని సహ ఉద్యోగులు ఎప్పుడైనా కలుస్తూ ఉంటారు. వాళ్ళు హలో! అని చెప్పి ఊరుకోకుండా మీకు బి.పినా, షుగరా, గుండెజబ్బా అని అడుగుతారు. కొంచెం కాఫీపొడి ఉందా, చక్కెర ఉందా అన్నంత తేలికగా అవి మీకు లేవని బాధపడకండి. అన్నీ ఉన్నాయి అని చెప్పండి. అడిగినవాళ్ళకు ఆనందం. అవి లేకపోతే శరీరంలో

చలనం ఉండదు. అతి సర్వత్రా వర్జయేత్ ఉన్నదానితో తృప్తిపడండి. బి హేపీ!

ఇవన్నీ ఒక ఎత్తు, జననమరణాల గురించి తప్పనిసరిగా మీమాంస వస్తుంది. దేవుడున్నాడా! లేడా! అని చర్చ వస్తుంది. 'జాతస్య మరణం ధ్రువం' అని రెండు ముక్కలు చెప్పి సంస్కృతం అంతా కాచి వడబోసినట్లు చెపుతారు. వాళ్ళ భయం నిరాశావాదం మన నరనరాల్లోకి ఎక్కించటానికి శాయశక్తులా కృషిచేస్తారు. మీరేం భయపడకండి. 'మరణశ్య జననం ధ్రువం' అన్న లోకోక్తి వినలేదా అని అడగండి. ఇది గుండెధైర్యాన్నిచ్చే తారకమంత్రం. మళ్ళీ వస్తామనే ఆలోచన గొప్పది, నిజానిజాలు పెరుమాళ్ళకెరుక.

అసలు స్వర్గం, నరకం దేవుడు అనేవి ఉన్నాయో, లేవో ఎవరికీ తెలియదు. 'కలడు కలండనువాడు కలడో లేడో' అన్న సంశయంలో పడ్డాడు పోతనామాత్యుడు. తినబోతూ రుచి అడగడమెందుకు? ఎట్లాగూ అక్కడ అన్ని సంగతులు తెలుస్తాయి గదా! అరవయి ఏండ్లు గడిచాకా మరో అరవయి ఏండ్లు ఎల్లాగూ ఉండేది లేదు. శరదశ్శీతంలో అరవయిపోతే నలభయి వసంతాలే. ఇందులో ఒక ధర్మసూత్రం ఉంది. నాస్తికభావాలు కలవాడని లోకులు చెప్పుకునే ఒక మహాకవి జగదీశ్వరుడతడెవడో కనపడితే బాగుండును అన్నాడు. లేడని ఒకవైపు, కనిపించాలని తపన ఒకవైపు, ఏదెలాగున్నా దేవుడున్నాడని చెప్పుకోవటంలో అన్ని విధాలా క్షేమం ఉంది. లేడు లేడని గొంతుచించుకున్నవాడు పైలోకానికి పోయినప్పుడు తీరా దేవుడున్నాడనుకోండి. ఏరా నేను లేనని డబ్బా కొట్టావట. ఒళ్ళు ఎలా ఉంది? అంటే తెల్లముఖం వేసి తలదించుకోవలసివస్తుంది. ఉన్నాడని చెప్పుకుంటే లేకపోయినా ఫరవాలేదు. నో డేంజర్.

ఇంతకీ చెప్పొచ్చేది ఏమిటంటే మనిషి అన్నవాడు వయసుతోబాటు పెరగాలి. చిన్నప్పుడు పెద్దవాళ్ళమైతే బాగుండునని చక్కగా తయారయి వయసులో ఉన్నవాళ్ళతో తెలుగు సినిమాలలోలాగా హాయిగా ఆడుకోవచ్చు (పనిపాటలేనివాళ్ళలా) అనుకుంటాం కాని, పెద్దయిన తర్వాత బాల్యమే బాగుంటుంది. వంటిమీద బట్టలు లేకపోయినా ఫరవాలేదు. ఆ స్వేచ్ఛ ఇప్పుడు రాదుకదా! అని అసూయపడటం మంచిది కాదు. కాలచక్రంతో బాటు నడచిపోతే వంటికి, మనసుకు గాయాలు తగలవు. అందుకని ముదిమి రెండో బాల్యం అన్నారు. అంతేకదా! దేని వైభవం దానిది!